క్లుప్తంగా

పైప్‌లైన్ లీకేజీలకు మరమ్మతులు



మరమ్మతులు చేయిస్తున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని చిచ్‌ధరి గ్రామ పంచాయతీ పరిధిలోని సేవాదాస్‌నగర్‌లో 'తాగు నీటి కటకట' శీర్షికన 'సాక్షి' దినపత్రికలో గురువారం కథనం ప్రచురితమైంది. స్పందించిన గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారి సురేశ్, పంచాయతీ కార్యదర్శి శ్రీవాణి రెడ్డి గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలోని మిషన్ భగీరథ పైప్‌లైన్‌కు దగ్గర ఉండి మరమ్మతులు చేయించారు. తాగునీటి ఎద్దటి లేకుండా చర్యలు చేపడుతామన్నారు.

30న మండల సర్వసభ్య సమావేశం

నార్నూర్: ఈనెల 30న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో జవహర్ శుక్రవారం తెలిపారు. ఎంపీపీ కనక మోతుబాయి అధ్యక్షతన ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. ఎంపీటీసీలు, అన్ని శాఖల అధికారులు సకాలంలో పూర్తి నివేదికతో హాజరు కావాలని కోరారు.

సమావేశాన్ని విజయవంతం చేయండి

ఇచ్చోడ: మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించే బీజేపీ కార్యకర్తల సమావేశాన్ని విజయవంతం చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు కేంద్రే నారాయణ కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. అభినందన్ కన్వెన్షన్‌లో మధ్యాహ్నం 1 గంటకు నిర్వహించనున్న సమావేశానికి ఆదిలాబాద్ పార్లమెంట్ అభ్యర్థి గోడం నగేశ్, జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానందం హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

రక్తదాన శిబిరం

ఇచ్చోడ: మండలంలోని దుబార్‌పేట్‌లో గురువారం నిర్వహించిన రక్తదాన శిబిరంలో పలువురు యువత స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఆదివాసీ బిరుదు గొండ్ తోటి యువజన సంఘం, తల్లి పిలుపు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఆదివాసీ బిరుదు గోండ్ గ్రామ అధ్యక్షుడు నైతం నాగరాజ్, గ్రామ మాజీ సర్పంచ్ చహకటి అభిమాన్, తల్లి పిలుపు జిల్లా ఇన్‌చార్జి లోకండి అనిల్ కుమార్, బ్లడ్ బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.


సామాజిక సేవ చేయడం అభినందనీయం

ఉట్నూర్‌రూరల్: నేటి యువత సామాజిక సేవ చేయడం అభినందనీయమని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఖయ్యుం అన్నారు. గురువారం లక్కారం గ్రామంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో యువ నాయకులు అజ్మీర జయచంద్ర ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. వేసవి కాలం దృష్ట్యా వివిధ ప్రాంతాల నుంచి పనుల నిమిత్తం మండల కేంద్రానికి వచ్చే ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కలీం పాషా, హైమద్, గ్రామస్తులు రఘు, నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

టెట్ ఫీజు తగ్గించాలి

ఇచ్చోడ: టెట్ ఫీజును తగ్గించాలని డిమాండ్ గురువారం బీఆర్ఎస్ నాయకులు డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడు తూ.. ఫీజు పెంచడం ద్వారా పేద అభ్యర్థులకు అన్యాయం జరుగుతుందన్నారు. ప్రభుత్వం వెంటనే ఫీజును తగ్గించాలని డిమాండ్‌చేశారు. వినతిపత్రం అందచేసిన వారిలో మల్లెపూల సుభాష్, భీమ బుచ్చన్న, మల్లెపూల స్వామి, కాడి రాజేందర్, రాథోడ్ రవి పాల్గొన్నారు.

బెల్ట్‌షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న ఎస్సై ధనశ్రీ

తలమడుగు: గ్రామాల్లో బెల్ట్‌షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై ధనశ్రీ హెచ్చరించారు. గురువారం పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రస్తుతం పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఎవరూ కూడా గ్రామాల్లో మద్యం, కల్తీకల్లు, ఇతర మత్తు పదార్థాలు విక్రయించరాదన్నారు. రూ. 50 వేలకు పైగా నగదు తీసుకెళ్లవద్దన్నారు. గ్రామాల్లో ఎవరైనా మద్యం విక్రయించినట్లు తెలిస్తే వెంటనే సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

అందని వైద్య సేవలు

- పల్లె దవాఖానలో సిబ్బంది ఇష్టారాజ్యం
- నీరుగారుతున్న ప్రభుత్వ లక్ష్యం
- పట్టించుకోని అధికారులు



ఈఫొటోలో కనిపిస్తున్నది ఆదిలాబాద్ రూరల్ మండలంలోని ఖానాపూర్ పల్లె దవాఖాన. గత రెండు రోజుల కిందట 'సాక్షి' అటు వైపు వెళ్లగా పల్లె దవాఖానకు తాళం వేసి ఉంది. అలాగే పల్లె దవాఖాన ఎదుట చెత్త, చెదారం పేరుకుపోయింది. దీంతో అసలు ఈ కేంద్రాన్ని తెరుస్తున్నారా? లేదా? అన్న అనుమానం కలుగుతుంది.

ఆదిలాబాద్‌రూరల్: ఆయా పీహెచ్‌సీ పరిధిలోని ప్రజలు మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి వైద్య చికిత్సలు చేయించుకోవాలంటే గత కొన్నేళ్ల కిందట ఇబ్బందులు ఎదుర్కొనే వారు. పీహెచ్‌సీకి దూరంలో ఉన్న మారుమూల గిరిజన ప్రాంతాల ప్రజలకు వారి సమీపంలోనే మెరుగైన వైద్య చికిత్సలు అందిచేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆలోచించాయి. అందులో భాగంగానే హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌లతో పాటు పల్లె దవాఖానల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. ఆదిలాబాద్ రూరల్ మండలంలో 13 ఆరోగ్య ఉప కేంద్రాలు ఉండగా.. ఇటీవల పలు గ్రామాల్లో పల్లె దవాఖానాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అందులో ఆదిలాబాద్ రూరల్, మావల మండలంలోని ఖండాల, ఖానాపూర్, భీంసరి, మావల, వాఘాపూర్ గ్రామాల్లో పల్లె దవాఖానాలను ఏర్పాటు చేశారు. వైద్యులతో పాటు వైద్య సిబ్బందిని నియమించారు.

అందించావాల్సిన సేవలు..

పీహెచ్‌సీలకు వెళ్లాకుండా ఉండేందుకు ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన పల్లె దవాఖానలో బీపీ, షుగర్, మలేరియా, హెచ్ఐవీ వంటి టెస్టులతో పాటు గర్భిణులకు వైద్య పరీక్షలు, మూత్ర పరీక్షలు, చిన్నారులకు ఇమ్యూనైజేషన్, కొన్ని క్రిటికల్ కేసులకు వైద్య చికిత్స అందిస్తారు. సిబ్బంది ప్రణాళిక ప్రకారం వారి పరిధిలోని గ్రామాల్లో పర్యటించడంతో పాటు పల్లె దవాఖానలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అందుబాటులో ఉండాలి. కానీ కొన్ని చోట్ల ఎలాంటి సమయపాలన పాటించడం లేదు. పలు గ్రామాల్లో తాళాలు వేసి దర్శనమిస్తున్నాయి.

వైద్య సేవలకు దూరం..

పల్లె దవాఖానల వైద్యులు, సిబ్బంది గర్భిణులకు వైద్య పరీక్షలు, ఫీల్డ్ విజిట్, ఇమ్యూనైజేషన్, కేంద్రంలో ఓపీడీ, వసతి గృహాలలో వైద్య శిబిరాలు వారంలో రోజుకు ఒకటి చొప్పున చేపట్టాలి. కానీ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యం నీరుగారుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి మెరుగైన వైద్య సేవలు అందించేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

ఇటీవలనే నియమించాం

పల్లె దవాఖాణాలలో ఇటీవలే కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్‌లను నియమించాం. ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించాం. కేంద్రంలో ఉన్న ఆశ అన్ని సందర్భాల్లో అందుబాటులో ఉంటారు. సీహెచ్‌వో ముందుగా అనుకున్న రోజు దవాఖానాలో అందుబాటులో ఉంటారు.

– సర్ఫారాజ్, మండల వైద్యాధికారి, ఆదిలాబాద్ రూరల్

నిఘా నీడలో పల్లెలు

- గ్రామాల్లో సీసీకెమెరాల ఏర్పాటు
- అవగాహన కల్పిస్తున్న పోలీసులు
- ఏర్పాటుకు ముందుకు వస్తున్న గ్రామస్తులు



ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు

తలమడుగు: నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు పాత్ర ఎంతో కీలకం. పట్టణాలతో పాటు పల్లెల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు, వాటి వలన కలిగే ఉపయోగాలను పోలీసులు ప్రజలకు వివరిస్తున్నారు. దీంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు ప్రజలు ముందుకు వస్తున్నారు. తమ వంతుగా గ్రామస్తులు చేయూతనందిస్తున్నారు. గతంలో గ్రామాల్లో దొంగతనాలు, అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకున్న సందర్భంలో ఎలాంటి ఆధారాలు లేక పోలీసులు, ప్రజలు ఆందోళనకు గురైన సందర్భాలు ఉన్నాయి. కానీ నేడు అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో నేరాస్తులను సులువుగా పట్టుకుంటున్నారు. కేసులను ఛేదించి ప్రజలకు న్యాయం చేస్తున్నారు. మండల కేంద్రంతో పాటు సుంకిడి, కుచులాపూర్, కజ్జర్ల, ఖోడద్, ఉండమ్, రుయ్యడి, బరంపూర్, దేవపూర్, లింగి గ్రామాల్లో గ్రామస్తుల సహకారంతో కెమెరాలు ఏర్పాటు చేశారు.

సీసీ కెమెరాలతో ఛేదించిన కేసులు..

ఇటీవల సుంకిడి గ్రామంలో అయ్యప్ప ఆలయంలో హుండీ దొంగలించిన నిందితుడిని సీసీ కెమెరా ఫుటేజ్ ఆధారంగా పోలీసులు దొంగను పట్టుకున్నారు. సుంకిడి గ్రామంలో అంతర్రాష్ట్ర రోడ్డుపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలు అయ్యాయి. ప్రమాదానికి కారణమైన లారీని గుర్తించారు.

అవగాహన కల్పించాం



మండలంలోని అన్ని గ్రామాల్లో సీసీ కెమెరా ఏర్పాటుకు అవగాహన కల్పించడం జరిగింది. మండలంలోని 28 గ్రామ పంచాయతీలలో 22 గ్రామాల్లో సీసీ కెమెరా ఏర్పాటు చేశారు. త్వరలో మండలం అన్ని గ్రామ పంచాయతీలో సీసీ కెమెరా ఏర్పాటుకు కృషి చేస్తాం. ప్రజలు కూడా సహకరిస్తున్నారు.

ధనశ్రీ, ఎస్సై

ఉదయమే పనులు చేపట్టాలి



పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో రాజీవీర్

నేరడిగొండ: ఉపాధిహామీ పనులను ఉదయం పూటనే చేపట్టాలని ఎంపీడీవో రాజీవీర్ అన్నారు. మండల కేంద్రంలో చేపడుతున్న ఉపాధిహామీ పనులను గురువారం పరిశీలించారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున వడదెబ్బ తగిలే అవకాశం ఉందన్నారు. పని ప్రదేశంలో నీడ, తాగునీరు, ప్రథమ చికిత్స కిట్లను అందుబాటులో ఉంచాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట టీఏలు, ఎఫ్ఏలు ఉన్నారు.

తాంసి: మండలంలోని వడ్డాడి గ్రామంలో చేపడుతున్న ఉపాధిహామీ పనులను ఎంపీడీవో మోహన్ రెడ్డి పరిశీలించారు. గ్రామ సమీపంలోని చెరువులో చేపడుతున్న కందకాల తవ్వకాన్ని పరిశీలించారు. పనులను పారదర్శకంగా చేపట్టాలని ఫీల్డ్ అసిస్టెంట్‌కు సూచించారు. పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతీ రోజు కూలీల హాజరు నమోదు చేయాలని ఆదేశించారు. వారి వెంట ఏపీవో విజయ, పంచాయతీ కార్యదర్శి అజయ్, ఫీల్డ్ అసిస్టెంట్ నర్సింగ్ ఉన్నారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి

ఇచ్చోడ: ఉపాధి కూలీల సంఖ్య పెంచే విధంగా ప్రత్యేక చొరవ తీసుకోవాలని డీఆర్‌డీవో సాయన్న అన్నారు. గురువారం బోథ్ మండలంలోని పిప్పల్‌దరిలో ఉపాధి పనులను పరిశీలించారు. కూలీల వేతనాలు పెంచినందున పనుల్లో కూలీలు సంఖ్య మరింత పెంచాలన్నారు. ప్రతీ కూలీ వంద రోజులు పనిచేసే విధంగా ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. పెరిగిన వేతనాలపై ప్రతీ గ్రామంలో అధికారులు కూలీలకు అవగాహన కల్పించాలని కోరారు. ఆయన వెంట ఎంపీడీవో రమేశ్, టెక్నికల్ అసిస్టెంట్ మధుకర్, తదితరులు ఉన్నారు.

ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి



మాట్లాడుతున్న ఖుష్బూ గుప్తా

ఇచ్చోడ: బోథ్ నియోజకవర్గంలో రానున్న పార్లమెంట్ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని బోథ్ నియోజకవర్గం అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా అన్నారు. గురువారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గం తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, ఎంఈవోలు, రెవెన్యూ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. పోలీంగ్ బూత్‌లను పరిశీలించి తగిన సౌకర్యాలు ఏర్పాటు చేయలన్నారు. ఏప్రిల్ 1 నుంచి 4 వరకు పీవో, ఏపీవో, వోపీవోలకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ తుకారాం, డిప్యూటీ తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఓటుహక్కును వినియోగించుకోవాలి

బేల: రానున్న పార్లమెంటు ఎన్నికల్లో భయభ్రాంతులకు గురికాకుండా ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకోవాలని బేల ఎస్సై రాధిక అన్నారు. గురువారం మండల కేంద్రంలో జాతీయ రహదారి, ప్రధాన వీధుల గుండా ప్రత్యేక పోలీసు బలగాలతో కవాతు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిఒక్కరూ శాంతియుత వాతావరణానికి సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో జైనథ్ ఎస్సై పురుషోత్తం, ఎస్సై గణపతి, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించుకుంటాం



మిఠాయిలు తినిపించుకుంటున్న నాయకులు

ఇచ్చోడ: కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణను భారీ మోజార్టీతో గెలిపించుకుంటామని కాంగ్రెస్ నాయకులు ధీమా వ్యక్తం చేశారు. గురువారం సోనాలలో కాంగ్రెస్ నాయకులు స్వీట్లు పంచిపెట్టారు. కాంగ్రెస్ కార్యకర్తలు సైనికుల్లా పని చేసి అభ్యర్థి గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పోతన్న పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల సంబురాలు

బేల: మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై కాంగ్రెస్ నాయకులు సంబురాలు జరుపుకున్నారు. గురువారం టపాసులు పేల్చి, ఒకరికిఒకరు మిఠాయిలు తినిపించుకున్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఫైజుల్లాఖాన్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి సామ రూపేష్‌రెడ్డిలు మాట్లాడుతూ కాంగ్రెస్ అధిష్ఠానం ఎంపీ అభ్యర్థిగా ఆత్రం సుగుణను ప్రకటించడం స్వాగతిస్తున్నామన్నారు. నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి గెలిపించుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ నాక్లే రాందాస్, గావుండే ఘణే శ్యాం, ఆడ శంకర్, దేవ్‌శాళే విఠల్, మడావి చంద్రకాంత్, అవినాష్ పాల్గొన్నారు.

ధ్యానంతోనే మానసిక ప్రశాంతత



మాట్లాడుతున్న జెడ్పీటీసీ గోక గణేశ్‌రెడ్డి

తలమడుగు: ధ్యానంతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని జెడ్పీటీసీ గోక గణేశ్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పూలాజీ బాబా ధ్యాన మందిర కేంద్రం ఆధ్వర్యంలో ధ్యాన సభ్యుల నివాసంలో సప్తహ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ.. గత 26 సంవత్సరాల క్రితం కాటిపల్లి చిన దేవరెడ్డి పూలాజీ బాబా ధ్యాన మందిర కేంద్రాన్ని స్థాపించారని తెలిపారు. ఎన్నో కష్టాలను ఎదుర్కొని ధ్యాన మందిర కేంద్రాన్ని కొనసాగిస్తూ వచ్చారన్నారు. సభ్యులు విన్నపం మేరకు మందిరంలో బోరు వేయించానని, మోటర్‌ని కూడా తానే అందజేస్తానని జెడ్పీటీసీ తెలిపారు.

పత్తి అమ్మి డబ్బులు రాని రైతులు సంప్రదించాలి

ఇంద్రవెల్లి: సీసీఐ కొనుగోలు కేంద్రంలో పత్తి అమ్మి వరకు ఖాతాలో డబ్బులు జమ కాని రైతులు మండల కేంద్రంలోని ఏఎంసీ కార్యాలయంలో సంప్రదించాలని ఏఎంసీ కార్యదర్శి రాజేశ్వర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో పత్తి అమ్మిన కొంత మంది రైతులకు డబ్బులు రాలేదన్నారు.

విగ్రహం ఏర్పాటుకు విరాళం

తాంసి: మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద హిందూ యువసేన ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ మహరాజ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నారు. కాగా శివాజీ విగ్రహ ఏర్పాటుకు బీజేపీ జిల్లా నాయకుడు లోక ప్రవీణ్ రెడ్డి రూ. 50వేలు విరాళం అందజేశారు. గురువారం జిల్లా కేంద్రంలో హిందూ యువసేన నాయకులకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు పరమేష్, మంత్రి రాజు, సాయి, సిద్దార్థ్, రామన్న పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

నేరడిగొండ: మండలంలోని వాగ్ధారి గ్రామానికి చెందిన గస్కంటి ఆనంద్ అనారోగ్యం కారణంగా హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు.

విద్యుత్ సమస్య పరిష్కరించాలి

ఇచ్చోడ: మండలంలోని సోనాల ఒక్కటి, రెండో వార్డులో విద్యుత్ సమస్య ఉందని సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని వీడీసీ ఉపాధ్యక్షుడు భీంరావు కోరారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. ఉదయం 6.30 గంటల నుంచి మూడు గంటల పాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు. అధికారులు చొరవ తీసుకొని అంతరాయం కలుగ సరఫరా చేయాలని కోరారు.

సమస్యలు పరిష్కరించాలి

ఎదులాపురం: దివ్యాంగ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని జిల్లా దివ్యాంగ నిరుద్యోగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు సలీం ఆ సంఘం నాయకులతో కలిసి మున్సిపల్ కమిషనర్ ఖమర్ హైమద్‌కు గురువారం వినతిపత్రం సమర్పించారు. ఆదిలాబాద్ మున్సిపల్ బడ్జెట్‌లో దివ్యాంగుల సంక్షేమానికి 5 శాతం నిధులు కేటాయించాలని కోరారు. రిజర్వేషన్ ప్రకారం ఉద్యోగాలను కేటాయించాలని విన్నవించారు. అదే విధంగా తాము ఎదుర్కొంటున్న వివిధ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. నాయకులు సురేశ్, సుకుమార్ పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్ బార్ అసోసియేషన్ కార్యవర్గాన్ని గురువారం ఆదిలాబాద్ కోర్ట్ ప్రాంగణంలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎన్రాల నగేశ్, ఉపాధ్యక్షురాలుగా రజిత రెడ్డి, జనరల్ సెక్రెటరీగా సంతోష్ కుమార్, స్పోర్ట్స్ సెక్రెటరీగా ముజాహిద్ హుస్సేన్, జాయింట్ సెక్రెటరీగా రాహుల్ వాఘ్మరే, కోశాధికా రిగా రమణయ్య, మహిళ ప్రతినిధిగా తిలోత్తమలు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా రమణా రెడ్డి, వినోద్ రెడ్డి, భవనసింగ్‌లు వ్యవహరించారు.

ఉట్నూర్ మండల అధ్యక్షుడిగా బాపురెడ్డి

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా బాపురెడ్డి ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా ధీరజ్‌కుమార్ గుప్తా, జనరల్ సెక్రటరీగా జగన్ బానోత్, జాయింట్ సెక్రటరీగా పవార్ వసంత్‌రావు, కోశాధికారిగా చింతల గిరి, శ్రీనివాస్, లైబ్రరీ కార్యదర్శిగా జైవంత్‌రావులను ఎన్నుకున్నారు.

'ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్‌దే గెలుపు'



మాట్లాడుతున్న గుడిపల్లి నగేశ్

ఎదులాపురం: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధిస్తుందని ఆదిలాబాద్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గుడిపల్లి నగేశ్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రింట్ మీడియా ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. కాంగ్రెస్ ఆదిలాబాద్ లోక్‌సభ అభ్యర్థిగా ఆత్రం సుగుణక్కను బరిలో నిలిపిందన్నారు. ఆదివాసీల సంక్షేమం కోసం ఆమె ఎంతగానో కృషి చేశారని కొనియాడారు. మహిళా ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తూనే ఆదివాసీలకు అన్ని విధాలుగా అండగా నిలబడ్డారన్నారు. కాంగ్రెస్ మిగతా పార్టీలకు దీటుగా మహిళా అభ్యర్థిని పోటీకి నిలిపిందన్నారు. ఆత్రం సుగుణక్కను ఆదిలాబాద్ ఎంపీగా భారీ మెజార్టీతో గెలిపించేందుకు కాంగ్రెస్ శ్రేణులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే వెడ్మ బొజ్జును గెలిపించుకున్నట్లే ఆత్రం సుగుణక్కను గెలిపించుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు సంతోష్, అలీం, మహేందర్, వెంకన్న, అబ్దుల్లా, సలీ పాల్గొన్నారు.

'నేతకాని సమాజానికి క్షమాపణ చెప్పాలి'



మాట్లాడుతున్న దుర్గం శేఖర్

ఎదులాపురం: నేతకాని సామాజిక వర్గాన్ని కించపరించేలా వ్యాఖ్యలు చేసిన గుమ్మడి కుమార స్వామి తమ సామాజిక వర్గానికి వెంటనే క్షమాపణ చెప్పాలని నేతకాని మహర్ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు దుర్గం శేఖర్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ప్రింట్ మీడియా ప్రెస్‌క్లబ్‌లో గురువారం మాట్లాడారు. గుమ్మడి కుమార్ స్వామి నేతకాని జాతికి నీతి లేదంటూ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తమ మనోభావాలను దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేశారని, దీన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. బహిరంగ క్షమాపణ చెప్పకుంటే ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. సమావేశంలో సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దుర్గం నారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మణ్, జిల్లా ప్రధాన కార్యదర్శి రాంచందర్ మహాత్మే, జిల్లా మహిళా కోఆర్డినేటర్ జాడి విఠాబాయి, యువజన అధ్యక్షుడు రాహుల్ జాందడే, కార్యదర్శి సూరజ్ పాల్గొన్నారు.

గాలికుంటు నివారణ టీకాలు వేయించాలి



టీకా వేస్తున్న పశువైద్యాధికారి

బేల: పశువులకు తప్పనిసరిగా గాలికుంటు నివారణ టీకాలు వేయించాలని మండల పశు వైద్యాధికారి కాంబ్లే సిద్ధార్థ అన్నారు. గురువారం మండలంలోని చప్రాల, సైద్‌పూర్, సాంగ్వి(జి), పాతగూడ గ్రామాల్లో జిల్లా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గాలికుంటు టీకాలు వేశారు. టీకాలతో పశువులకు జీర్ణశక్తి మెరుగుపడుతుందన్నారు. కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ హరీష్, సిబ్బంది అశోక్, పుసాం రితేష్, రవీందర్, వెంకటి, పోచ్చన్న పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

ఇచ్చోడ: మండలంలో నిర్వహించే పశువైద్య శిబిరాలను పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యాధికారి గోవింద్ నాయక్ అన్నారు. గురువారం గేర్జంలో పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత గాలికుంటు టీకాలను తమ పశువులకు వేయించాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది శేఖర్, దేవురావు, రైతులు పాల్గొన్నారు.

పేద కుటుంబానికి ఆర్థిక చేయూత



నగదు అందజేస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని మాలేబోరిగాం గ్రామానికి చెందిన ఓ కుటుంబానికి అదే గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కుమ్ర గంగాదేవి రాజు, గేడం రాములు గురువారం ఆర్థిక సాయం అందజేసి అండగా నిలిచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ గ్రామానికి చెందిన తుమ్ర జంగుబాయి బారిక్‌రావ్ దంపతుల కుమారుడు తుమ్ర మంతుతో కెరమెరి మండలం చిత్తగూడ గ్రామానికి చెందిన యువతితో నిశ్చితార్థమైంది. పెళ్లి కుమారుడి తండ్రి బారిక్‌రావ్ మంతు నాలుగేళ్ల వయస్సు ఉన్నప్పుడే మృతి చెందాడు. దీంతో తల్లి జంగుబాయి వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తుంది. తుమ్ర మంతు వివాహం ఏప్రిల్ 5న నిర్వహించేందుకు నిర్ణయించారు. వారిది పేద కుటుంబం కావడంతో గ్రామానికి చెందిన గంగాదేవి రాజు, రాములు పెళ్లి ఖర్చు కోసం రూ. 10 వేల నగదు అందజేసి అండగా నిలిచారు. దీంతో ఆమె వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, వదువి విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ఆదిలాబాద్
99516 02888
99122 20764
Office mail : nzbadvt@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఆదిలాబాద్ : కె.రమేష్ - 8019715058
బోథ్ : ఖాజా మొయినొద్దీన్ - 7997958184
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899